
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 నవంబర్ 2022
5
కాకినాడ



నేడు జిల్లా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ ఎన్‌వివి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లాలోని పలు సమస్యలపై ప్రతినిదులు చర్చిస్తారని, సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



కాకినాడ కలెక్టరేట్‌లో..

భారతదేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని సోమవారం పలుచోట్ల ఉత్సాహంగా నిర్వహించారు. నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు. బాలబాలికలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జెసి ఎస్.ఇలాక్కియ, డిఆర్‌ఒ కె.శ్రీధర్ రెడ్డితో కలసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. **కాకినాడ రూరల్** తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో అంగన్వాడీ టీచర్ సిహెచ్.విజయ బాలలకు పోటీలకు నిర్వహించారు. బహుమతులు అందజేశారు. సిహెచ్.మహతి, లత, తాడితూరి కావ్య, బలసాడి సత్య, చింతపల్లి ధర్మసాస్థ(స్వామి), ఇళ్ల నాగవేణి, సిహెచ్.శ్రీరమణి పాల్గొన్నారు. సర్పవరంలో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు పాల్గొన్నారు. **సామర్లకోట** రైల్వే ఎస్ఐ బి.లోవరాజు బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వి.రాజు, తాళ్లూరి వైకుంఠం, జి.గోవిందు, కె.అరుణ, ఎఎల్‌వి.కుమారి, కె.శ్రీనివాస్ జి.శ్రీనివాస్, గోపాలకృష్ణ పాల్గొన్నారు. సిడిపిఒ జి.ఉష ఆధ్వర్యాన అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంవి.శ్రీలక్ష్మి, బి.శ్యామల దేవి, శ్యామలా కుమారి పాల్గొన్నారు. **జగ్గంపేట** శాఖా గ్రంథాలయంలో ఉప సర్పంచ్ బండారు రాజా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కాపావరపు రమణ, మారిసెట్టి భద్రం మాస్టర్, కొత్త కొండబాబు, బచ్చల సుధీర్ పాల్గొన్నారు. **పెద్దాపురంలో** మెజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, విట్‌కర్ బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కందుల వెంకటచలం, మడికి రాంబాబు, ఎస్.దుర్గారావు, ఎస్.విశాలాక్షి, ఆర్.కామేశ్వరరావు, ఎం.భాస్కరరావు, నూతలపాటి అప్పలకొండ, నాని, బల్లమూడి సూర్యనారాయణ పాల్గొన్నారు. **కాజులూరు** గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శంకర్ రెడ్డి, గ్రంథాలయాధికారి ప్రసాద్ పాల్గొన్నారు. **తునిలోని** లయోలా విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం కార్యక్రమాన్ని కరస్పాండెంట్ దండం రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.



కోటనందూరులో..

ఆదిత్యలో పోలీ టెక్‌ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో రీజినల్ పోలీటెక్ ఫెస్ట్ సోమవారం ఘనంగా ప్రారంభమయ్యింది. ముఖ్య అతిథులుగా జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, ఎపి టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి పాల్గొన్నారు. విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ టెక్ ఫెస్ట్ నిర్వహించే అవకాశం తమ ఆదిత్య విద్యాసంస్థలకు ఇవ్వడం ఆనందదాయకన్నారు. ఆదిత్య అధినేత డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ నైపుణ్యం గల యువత తమ సృజనకు పదును పెట్టక పోవడం వల్ల మనం ఇంకా ఇతర దేశాల నుంచి అనేక రకాల వస్తువులను దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు. ఎంఎల్ఎ జ్యోతుల చంటి బాబు మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలలో సీట్లు భర్తీకాకుండా మిగిలి పోవడం చూస్తు న్నామన్నారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వారి కృత్యాలను ప్రదర్శించేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉత్తమ ప్రాజెక్టులను ఈ నెల 24 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌కు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జెడి జె.సత్యనారాయణమూర్తి, ఎపిటి ప్రిన్సిపాల్ జనార్ధన రావు, డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్.కుమార్ పాల్గొన్నారు.



టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చంటిబాబు

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రంలో ఇల్లు లేని పేదవారి సొంతింటి కల నెరవేర్చడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎక్కడా జరగని రీతిలో కృషి చేస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. రామారావుపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు కేటాయించడమే కాక పేదల కాలనీల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో జనసేన నాయకులు నిర్వహిస్తున్న కార్యక్రమం బూటకమన్నారు. వారు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమన్నారు. ఏ రాష్ట్రంలో జరగని రీతిలో వేగవంతంగా పేదల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయ న్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు,మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఊబా జాన్ మోసెస్, మేడిశెట్టి వీరభద్రం, తలారి దొరబాబు, మోరంపూడి రంగ, వీరరాఘవరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సుగర్ వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

ప్రపంచ సుగర్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బి.మనోహర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలు ఎక్కువ శాతం సుగర్ వ్యాధికి గురవుతున్నారని, శారీరక శ్రమ లేకపోవడం, విపరీతమైన పని ఒత్తిడి, ఆహార నియమాలు పాటించకపోవడం, నిర్ధేశిత సమయంలో ఆహారం తీసుకోకపోవడం ఈ వ్యాధికి మూల కారణమన్నారు. సుగర్ వ్యాధి ఉంది అని తెలిసినా సొంతంగా మందులు వాడితే గుండె, కిడ్నీ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎఒ ఐవి రమణ కాకినాడలో ఉన్న పాత్రికేయులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, భారత అభియాన్ ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్స్ డయాబెటిక్ ఆసుపత్రి ఆధ్వర్యాన మధుమేహ దినోత్సవం నిర్వహించినట్లు డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఇవివిఎల్ నాయుడు తెలిపారు. డాక్టర్ వెంకట భావేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మధుమేహ వ్యాధిపై అవగాహన ఉండాలని అన్నారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోజువారీ ఆహార నియమాలు, శారీరక వ్యాయామం, మానసిక సమతుల్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ బ్రహ్మజీ, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకర రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న మనోహర ప్రసాద్

జిఆర్‌టి ఆధ్వర్యంలో కేక్ మిక్సింగ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గ్రాండ్ జిఆర్‌టి హోటల్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రసిద్ధి చెందిన వివిధ రకాల విదేశీ డ్రింకు బ్రాండులతో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతరం కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉప్పాడ జాంధానీ చీరల ఉత్పత్తిదారులు లొల్ల సత్యనారాయణ, రామకృష్ణరావు, కాకినాడ సుబ్బయ్య హోటల్ అధినేత గునుపూడి శ్రీనివాస్, లీలావతి దంపతులను సన్మానించారు. విదేశీ బ్రాండ్ల మద్యం డ్రై ఫ్రూట్స్‌ను కలిపి సుమారు 45 రోజులపాటు పులియబెట్టి క్రిస్మస్ సందర్భంగా కేకును తయారు చేసే విధానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోటల్స్ జనరల్ మేనేజర్ మానీదీప్ జాస్, చెఫ్ కుమార్, ప్రభాకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కిస్మస్ కేకు తయారు చేస్తున్న సిబ్బంది

బోట్ క్లబ్ పార్క్ సమస్యలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బోట్ క్లబ్ ఉద్యానవనంలో నెలకొన్న సమస్యలపై వాకర్స్ సంఘం ప్రతినిధులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వాకర్స సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ బోట్ క్లబ్ ఉద్యానవనంలో 2011 నుంచి తమ వాకర్స్ సంఘం ప్రతినెలా 2వ ఆదివారం, నాలుగవ ఆదివారం ప్రముఖ వైద్యులతో ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, ఉచితంగా రక్త పరీక్షలు, బిపి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తమ సొంత ఖర్చులతో గ్రంథాలయం కూడా నిర్విస్తున్నామన్నారు. ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు వాకర్స్ సంఘ కార్యాలయానికి తాళం వేయడంతో పాటు వాకర్స్‌కు మేలు చేస్తున్న వైద్య శిబిరాలు నిర్వహించరాదంటూ పలు ఆటంకాలు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. పార్క్ గేట్లు కూడా పూర్తిగా తెరవడం లేదన్నారు. ఈ విషయాలపై స్పందనలో వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై నగరపాలక సంస్థ అధికారులు స్పందించి తగిని చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడానికి ఆటంకాలు కల్పించరాదని, చెత్తాచెదారం తొలగించాలని, వాకర్స్ సంఘ కార్యాలయానికి వేసిన తాళం తొలగించాలని కోరినట్లు తెలిపారు. కార్యదర్శి దాసరి శ్రీధర్, కోశాధికారి పివి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్'నిజం'



అదెలాగో కనుక్కోండి సార్..
మనమూ కిరికిరి చేయొచ్చు..!!

గ్రంథాలయ భవనానికి సొంత స్థలం

ప్రజాశక్తి-సామర్లకోట

గ్రంథాలయ భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి సొంత స్థలాన్ని సమకూర్చనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి హామీ ఇచ్చారు. 55వ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం స్థానిక గ్రంథాలయాధికారి బందిల రత్నామణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ అరుణ కృష్ణమూర్తి రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం సొంత భవనానికి మున్సిపల్ స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వారోత్సవాల్లో భాగంగా 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ నేతల సంస్మరణ, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, 19న దిశా చట్టం పైన, మహిళ సాధికారత పైన చర్చాంశాలు, చివరి రోజు 20వ తేదీన డిజిటల్ గ్రంథాలయాల ఉపయోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్టు గ్రంథాలయ అధికారి రత్నమణి చెప్పారు.

పోలీస్ స్పందనకు 60 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ స్పందనకు 60 అర్జీలు వచ్చాయని ఎస్‌పి తెలిపారు. మహిళల నుంచి 29, పురుషుల నుంచి 31 వచ్చాయని, కుటుంబ తగాదాలు, సివిల్ వివాదాలతో పాటుగా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. అర్జీదారులకు సమస్యల పరిష్కారానికి కింది స్థాయిలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి పి.శ్రీనివాస్, ఎస్‌బి డిఎస్‌పి పి.మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని తెప్ప ఉత్సవం

ప్రజాశక్తి-సామర్లకోట

కుమారరామ భీమేశ్వరస్వామి తెప్ప ఉత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ ఇఒ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కటకం సతీష్ దంపతులు పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే యాత్రికులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారిని, బాలా త్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ పూజల్లో దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ రూరల్ విద్యుత్ నగర్, ఇంద్రపాలెం, చీడిగ వంటి ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల వినియోగం పెరిగి యువత పెడదారి పడుతోందని విశ్రాంత ఉద్యోగి పితాని ప్రభాకర రావు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. రాత్రి వేళలో యువత గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు సేవించి ఆ దారిన వెళుతున్న వారిపై దాడులకు దిగుతున్నారని ప్రభాకర రావు తెలిపారు. కలెక్టర్ స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కిటకిటలాడిన వీరభద్రస్వామి ఆలయం

ప్రజాశక్తి-పెదపూడి

మండలంలో పైన గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. పూజారి అమ్మిన పాపారాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మామిడాడకు చెందిన గుండాబత్తుల శ్రీనివాస్, గుండాబత్తుల వీరబాబు ఆధ్వర్యంలో 2000 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అర్హులైన ప్రతీ పేదవానికీ వైసిపి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందించి స్థలాలు ఇస్తోందనివైసిపి రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పేద బలహీన వర్గాలకు మంచి చేయటం ప్రతిపక్ష పార్టీలకు నచ్చకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో జనసేన, తదితర పార్టీలు జగనన్న ఇళ్లపై చేస్తున్న రాద్ధాంతం సరికాదన్నారు. ఇళ్లస్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో అత్యంత విలువైన భూములు కొనుగోలు చేసి పేదల పక్షపాతిగా ఇంటి పట్టాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ పక్కా ఇంటిని నిర్మించి వారి చేతిలో రూ.లక్షలాది ఆస్తిని పెట్టి పేద అక్కచెల్లెమ్మలకు పూర్తి భరోసా నివ్వడం వైసిపి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఆ దిశగా చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తోందన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలను కంప్యూటీకరిస్తామని జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ వెంకన్న బాబు, సంస్థ కార్యదర్శి వివిఎల్‌ఎన్ఎస్‌వి.ప్రసాద్, ఉప గ్రంథాలయాధికారి ఆర్.వెంకటరాము, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు. **పెద్దాపురం** శాఖా గ్రంథాలయంలో ఉత్సవాలను చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడారు. ఈ సభలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, బల్లమూడి సూర్యనారాయణ మూర్తి, కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, బి.రంగారావు, టి.కాటమరాజు, హెచ్ఎం శివజ్యోతి, బి.నాగమణి పాల్గొన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో పుస్తక వారోత్సవాలను ప్రిన్సిపల్ కె.రామిరెడ్డి ప్రారంభించారు. లైబ్రేరియన్ ఎం.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. **కరప** వేళంగి గ్రంథాలయాల్లో ఉపాధ్యాయులు పి.వెంకటరంగయ్య, ఎన్‌విఎస్‌పి. కుమార్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సవిలే రాజేష్, పట్టా కృపారావు, శ్రీనివాస్ సాదే లోహిదాస్ పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** ఉప్పాడ గ్రంథాలయంలో కార్యదర్శి పి.శ్రీనివాస్ మాట్లాడారు. **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలోని గల వివిధ కళాశాలల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి పాల్గొని గ్రంథాలయోద్యమ రూపకర్త అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధాన గ్రంథాలయాధికారి అశోక్ కుమార్, డాక్టర్ కె.రవిశంకర్ ప్రిన్సిపల్ డాక్టర్ డోల సంజయ్ ఎన్.దివ్య, డాక్టర్ కె.రామకృష్ణ, కీర్తి సాయి, వినీల, కె.వెంకటరమణ, రామచంద్రారెడ్డి, చింతయ్య, నాగబాబు, రమ్య, సుజాత, ఎర్రయ్యమ్మ, భూదేవి, సిహెచ్.స్వామి, ప్రశాంతి పాల్గొన్నారు. **పెదపూడిలో** వైసిపి నాయకుడు కోరా వీర్రాజు చౌదరి గ్రంథాలయంలో మాజీ ప్రధానిజవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తిప్పాన వెంకటరమణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** కోరంగి శాఖా గ్రంథాలయంలో హెచ్ఎం జగదేశ్వరి, ఉపాధ్యాయులు అప్పారావు, పైడి రాజు, రామకృష్ణ, చంటి వాసు, సత్తి బాబు, బాబీ, తాతాజీ, పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో చిన్నారులతో జెడ్‌పి చైర్మన్



సచివాలయాల్లో అంగన్‌వాడీల వినతులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సామర్లకోట మండలం ఉండూరు గ్రామ సచివాలయాల్లో యూనియన్ నాయకులు వినతి పత్రాలు అందచేశారు. అంగన్వాడీ సెంటర్లకు మౌలిక వసతులు తాగునీరు, ప్రహారీ, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్‌లు, కుర్చీల సమస్యలను పరిష్కరించాలని, లబ్దిదారులకు నాణ్యమైన కందిపప్పు, ఆయిల్, ఆహారం ఇవ్వాలని, వైఎస్సార్ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వం సరఫరా చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులతో తొలగించిన వారిని తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డి ఎస్తేరు రాణి, బక్కి విజయలక్ష్మి, ఎస్.బేబి, కె.వరలక్ష్మి, ఎన్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తితో కెసిబిఎస్ సేవలు

ప్రజాశక్తి-కాకినాడ

సహకార రంగంలో ఏర్పాటైన కెసిబిఎస్ సంస్థ సమర్ధవంతమైన సేవలతో శతాబ్ధి ఉత్సవాలు జరుపుకోవడం స్ఫూర్తిదాయకమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ ఆకుల వీర్రాజు పేర్కొన్నారు. ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్‌సొసైటీ కార్యాలయంలో సోమవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు రెడ్డి రాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. శతాబ్ధి ఉత్సవాలను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో సుమారు 500 మంది రోగులు, వారి బంధువులకు భోజన వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన సహకార వారోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వీర్రాజు మాట్లాడుతూ నిరుపేదలు కూడా ఇళ్ళ నిర్మాణం చేపట్టేలా మంచి సదాశయంతో ఏర్పాటైన సంస్థ సమర్ధవంతమైన సేవలు అందిస్తోందని ప్రశంసించారు. వ్యాపార పరంగా కాక సేవా భావంతో కూడా పనిచేయడం ఇతర సొసైటీలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కెసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఖాతాదారుల మన్ననలు చూరగొన్న తమ సంస్థ శతాబ్ధి ఉత్సవాల నేపథ్యంలో సేవలను విస్తృతం చేస్తామన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్, మేనేజర్ చీమలకొండ గంగాధరం, డిసిసిబి సిఇఒ ఆర్‌వి.నరసింహారావు, డిజిఎం త్రినాథ్, రామదాసు కో ఆపరేటివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ లెక్చరర్ ఆదిమూలపు వెంకటేశ్వరరావు, కెసిబిఎస్ డైరెక్టర్లు ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివబాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ముమ్మిడి వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీర్రాజు

కళాశాల స్థలం ఆక్రమణకు గురైతే సహించం

ప్రజాశక్తి-జగ్గంపేట

జగ్గంపేట డిగ్రీ కళాశాల స్థలం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆక్రమణకు గురైందని, విద్యార్థుల ప్రయోజనం నిమిత్తం దాన్ని అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా స్పష్టం చేశారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర నాయుడుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి కళాశాల ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. కళాశాల నిర్మాణంతోపాటు క్రీడమైదానంగా తీర్చిదిద్దడానికి అనుగుణంగా 10 ఎకరాల భూమిని గత ప్రభుత్వం కేటాయించగా మిగిలిన భూమిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పది నుంచి 15 అడుగులు కళాశాల స్థలం ఆక్రమణకు గురయ్యిందన్నారు. ఆక్రమణ ఫలితంగా భవిష్యత్తులో విద్యార్థులు క్రీడా ప్రదేశాన్ని కోల్పోయే అవకాశం ఉందన్నారు. కమ్యూనిటీ హాలుకు సంబంధించిన వారు వెంటనే వెనక్కి తగ్గాలన్నారు.

రిక్షా కార్మికులకు బ్యాంకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి-సామర్లకోట

రిక్షా కార్మికులకు ఉపాధి కోసం కొత్త రిక్షాలు కొనుక్కునేందుకు రుణాలు వ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలోని రిక్షా కార్మిక సంఘం 10వ మహాసభలో శ్రీనివాస్ మాట్లాడుతూ అనేకమంది కార్మికుల రిక్షాలు పాడయ్యాయని, కొత్త రిక్షాలు కొనుక్కోలేక అనేక మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బ్యాంకుల్లో సెక్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని కోరారు. వయసు మళ్లిన రిక్షా కార్మికులకు పింఛన్లు అందించాలని కోరారు. రిక్షాసంఘం నూతన కమిటీ ఎన్నిక గౌరవాధ్యక్షులు చల్లా మహేష్, అధ్యక్షులు ముప్పిడి సత్తిబాబు, కార్యదర్శి కరక మాణిక్యం, ఉపాధ్యక్షులు బొబ్బాది సింహాద్రి, సహకార్యదర్శి మరడబుడి నాగరాజు, కమిటీ సభ్యులుగా చెప్పుల నూకరాజు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు కాజులూరు మండలం పల్లిపాలెంలో సుమారు 35 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, ఆ భూమిని బ్యాంక్‌లో తనఖా పెట్టి సుమారు రూ.5 కోట్లు అప్పు తెచ్చారని జనసేన పార్టీ నాయకులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పార్టీ పిఎసి సభ్యుడు పంతం నానాజీ, పితాని బాలకృష్ణ, పార్టీ మండపేట ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ, అమలాపురం పార్టీ ఇన్చార్జ్ శెట్టిబత్తుల రాజుబాబు తదితలు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. అప్పటి రామచంద్రాపురం ఆర్‌డిఒ లేండ్ ప్రాసెసింగ్ అధికారి కలిసి సర్వే చేసి తోట కబ్జా చేసిన భూమి ప్రభుత్వానికి చెందినదిగా నివేదిక అందించారన్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

గాంధీ సత్రం పాలకవర్గం నియామకం

కోటనందూరు : తుని గాంధీ సత్రం నూతన పాలకవర్గాన్ని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో కమిషనర్ హరి జోహార్ లాల్ నియమించారు. చైర్మన్‌గా అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, సభ్యులుగా చెక్క ఈశ్వరమ్మ, బోడపాటి సుబ్రహ్మణ్యం, లక్ష్మి, కొండ వెంకట్రావు, శ్రీను నియమితులయ్యారు. నూతన పాలకవర్గానికి తుని మునిసిపాలిటీ చైర్మన్ ఏలూరు సుధా బాలు పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

జగనన్న కాలనీల పరిశీలన

యు.కొత్తపల్లి : పేద ప్రజలకు ఇళ్లు ఇస్తామన్న వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో చేసిన మోసాలను వెలికితీస్తామని జనసేన పార్టీ నాయకులు తెలగం శెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గోర్స, కొమరగిరి గ్రామంలో కడుతున్న ఇళ్ళను పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు 12, 13, 14 తేదీల్లో జగనన్న ఇళ్లు.. పేదల కన్నీళ్లు.. అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్యాయం జరిగిన లబ్ధిదారుల సమస్యలను తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాల విషయమై ప్రభుత్వ తీరును ఎండగడతామన్నారు. అంతేకాక సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, ప్రభుత్వం ఇస్తున్న నగదు బేస్‌మెంట్‌కు కూడా సరిపోదని ఎలా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని తెలగంశెట్టి ప్రశ్నించారు. మరికొన్నిచోట్ల మధ్యలోనే జగనన్న ఇల్లు కట్టుకోలేక బోడి గోడలతో దర్శనం ఇస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, లబ్ధిదారులకు సబ్సిడీపై ఇసుక, సిమెంట్, ఐరన్, ఇటుక సరఫరా చేయాలని తద్వారా కొంతమంది లబ్ధిదారులకు కాలనీలు కొట్టుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జ శ్రీను, బండి ఏసుబాబు, గంగాధర్ రావు, చిన్న వీరబాబు, శంకర్, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

కాట్రేనికోన : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. కాట్రేనికోన మండలం బలుసుతిప్ప, మొల్లేటిమొగ, కొత్తపాలెం, పోర గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎల్ఎమాట్లాడుతూ సిఎం జగన్ మత్స్యకారుల సంక్షేమానికి పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయ రంగం తర్వాత రెండో స్థానంలో మత్స్య పరిశ్రమ ఉందన్నారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ జీవనం సాగించే గంగపుత్రులకు ప్రభుత్వం వేట విరామ సమయంలో రూ.10 వేలు అందిస్తోందన్నారు. చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ఈనెల 21న ప్రపంచ మత్స్యకారులు దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలో జరగనున్న సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలి రావాలన్నారు. ఆ రోజున ఒఎన్‌జిసి రెండో విడత నష్ట పరిహారం రూ.46వేలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, మత్స్యకార నాయకులు ఓలేటి సతీష్, మల్లాడి ఆదినారాయణ, బర్రె రాంబాబు, సంగాని చిన్ని, అప్పాజీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఐ.పోలవరం : జి.మూలపొలం గ్రామ పంచాయ పరిధిలో ఉన్న జెడ్‌పి ఉన్న పాఠశాలను విద్యా కమిటీ ఛైర్మన్ సంగాని దుర్గాప్రసాద్, వై సి పి నాయకుడు మందపాటి భైరవస్వామి సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. టెన్త్ విద్యార్థులకు రెండు నెలల నుంచి పిఎస్ బోధించే ఉపాధ్యాయుడు అనారోగ్యరీత్యా సెలవులో ఉన్నారని, తమకు సిలబస్ చెప్పేవారు లేరని విద్యార్ధులు అంటున్నారు. హైస్కూల్‌కు అతి దగ్గరగా ఉన్న విద్యుత్ స్థభాన్ని తొలగించి దూరంగా వేయాలని వారు అన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారితో మాట్లాడుతానని వైసిపి నాయకుడు సర్పంచ్ భర్త భైరవస్వామి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్. శ్రీనివాసరావు, బి.రవి, శ్రీనివాసరావు, జయప్రకాష్ నారాయణ ఉన్నారు.

మధుమేహం నిర్ధారణకు మెడికల్ క్యాంపు

పెరవలి : అంతర్జాతీయ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా ముక్కామలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీవు ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధిని నిరంతరం పరీక్షించుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరిగెల అరుణకుమారి, సెక్రటరీ సలాది ఉదయభాస్కరరావు, ట్రెజరర్ ఎ.బాలసుబ్రహ్మణ్యం, ఎంపిటిసి జి.రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు పాల్గొన్నారు

ఘనంగా వనసమారాధన

నిడదవోలు : కుల, మతాలకతీతంగా కార్తీక వన సమారాధన నిర్వహించుకోవడం ఆదర్శనీయమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మల్టిపర్పస్ కమ్యునీటి భవన అభివద్ధి కమిటీ ఛైర్మన్ బయ్యే వెంకట్రావు అన్నారు. కమ్యునీటి భవన ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్తీక వన సమారాధనలో ఎస్‌సి, బిసి, మైనార్టీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ సమసమాజ స్థాపన అంబేద్కర్ ఆశయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం కమిటీ సభ్యులను పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సమరాధనలో ఎస్.వెంకటేశ్వరరావు, ఇ.సత్యనారాయణ, నక్కా వెంకటేశ్వర్లు, ఎస్.జయరాజు, ఎమ్‌డి అస్లాం, కె.వసంతరాజు పాల్గొన్నారు.

శివ నామమరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

కడియం : కార్తీక సోమవారం నేపథ్యంలో మండలంలోని కడియం, వేమగిరి, జేగురుపాడు, వీరవరం, మురమండ, కడియపులంక శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుండే ఆలయాలకు యాత్రికులు పోటెత్తారు. ఈశ్వరునికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఇఒలు, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాకినాడ 26వ డివిజన్ పురంవారివీధి ప్రాంతంలో సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న సాగర్, ట్రైనీకలెక్టర్ ప్రఖర్ జైన్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో నవరత్న పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ 26వ డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీలతోపాటు దాదాపు అభివృద్ధి పనులన్నీ పూర్తిచేశామన్నారు. త్వరలోనే ఆ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం కూడా పూర్తిచేసి నాణ్యమైన మంచినీరును అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థ పనితీరుపట్ల ప్రజల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమౌతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి ప్రసాద్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు సంగాని నందం, కామాడి సీత, చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, కొప్పనాతి బాబి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పైడా కాలేజీలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలో పటవలలోని పైడా గ్రూపు విద్యాసంస్థల ఆధ్వర్యంలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న 120 మంది విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పొలిటెక్నిక్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ క్రాస్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ కాకినాడ జిల్లా ప్రొఫెషనల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సూర్య ప్రకాష్ మాట్లాడారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రాణాలను కాపాడి రక్తాన్ని దానం చేసినందుకు విద్యార్థులను ఆయన అభినందించారు. పైడా గ్రూప్ సెక్రటరీ పైడా శ్రీరామ్ మాట్లాడుతూ పైడా సంస్థలు సామాజిక సేవలో ముందున్నాయని తెలిపారు. బాదం బాలకృష్ణ బ్లడ్ బ్యాంక్ అధినేత బాలకృష్ణ హాజరై యువతీ యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ వీరభద్రరావు, డిడి రవీంద్రారెడ్డి, లయన్స్ క్లబ్ కాకినాడ జిల్లా ప్రెసిడెంట్ బి.రవికుమార్, సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ దుర్గరాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ నాయుడు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి-కరప

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని మండలంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ కన్నబాబుని రైతులు కలిసి విన్నవించుకున్నారు. సోమవారం రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు వేములవాడలో శివారు సిరిగలపల్లంక వాసులు కలిశారు. గ్రామంలో జ్వరాలతో చాలామంది బాధపడుతున్నారని, జ్వరాలు ఎందుకు వస్తున్నాయో తెలియడం లేదని, వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపైన స్పందించి ఆయన గ్రామంలో పర్యటించారు. అక్కడ నుంచి జిల్లా వైద్య శాఖాధికారికి ఫోన్ చేసి, జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, వైద్య బృందాన్ని ఆ గ్రామానికి పంపించి, సర్వే నిర్వహించి, కారణాలు తెలుసుకోవాలని, ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని రైతులు కలిసి తొలకరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, నిబంధనలు సడలించి మద్దతుధరకు ధాన్యం కొనుగోలు చేయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.మంగాదేవి భీమశంకర్, బండే తాతాజీ, అప్పనపల్లి పెద్ద, పెంకే సత్తిబాబు, గ్రామ కార్యదర్శి వీరభద్రరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీ సర్వే గణాంకాలు

ప్రజాశక్తి-కాజులూరు

జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీ సర్వేకు సంబంధించి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కాకినాడ ఆర్‌డిఒ బివి.రమణ అన్నారు. సోమవారం కాజులూరు తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వే కు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ బివి.రమణ మాట్లాడుతూ మండలంలో 19 రెవెన్యూ గ్రామాలకు గాను 11 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో రీ సర్వేకు సంబంధించి భూముల కచ్చితత్వం, విలువ గణాంకాలు పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి రీ సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారి జి.వరహాలయ్య, తహశీల్దారు సాయి సత్యనారాయణ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అప్పారావు, డిటి సుబ్బారావు, సర్వేయర్ రూపావతి, ఆర్ఐ వేగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

ఇద్దరికి కత్తిపోట్లు, జిజిహెచ్‌లో చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గండేపల్లి మండలంలోని ఓ ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్, ఫైనల్ ఇయర్ విద్యార్థులు గొడవ పడ్డారు. ఇది కాస్తా కత్తిపోట్లకు దారితీసింది. ఈ దాడిలో ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఘంటసాల సాయితేజ, ముమ్మిడి సాయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు కాకినాడ జిజిహెచ్ తరలించారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్తున్నారు. గాయపడిన విద్యార్థులను ఎస్ఎఫ్ఐ నాయకులు టి.రాజా, సూరిబాబు పరామర్శించారు. ఘర్షణకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



బడుగువానిలంకలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంక సచివాలయంలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ సంచార వైద్య శిబిరంలో సోమవారం 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు దూలం సత్తిబాబు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ సంచార శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కటారి గంగరాజు, కటారి కుమార్, కార్యదర్శి యు.సుప్రియ, ఎఎన్ఎం రాజమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శుక్లా తదితరులు

కుష్టు నిర్మూలనపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అమలాపురం

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంపై పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవాళ్లు ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి ఎండిటి మందులు వాడాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే బహుళ ఔషధ చికిత్సలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తారన్నారు. కార్యక్రమంలో. డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని సిహెచ్‌వి భరత్ లక్ష్మి, ప్రాంతీయాసుపత్రి సూపరిం టెండెంట్ శంకర్రావు, రెడ్ క్రాస్ కార్యదర్శి శర్మ, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల అభివద్ధి అధికారి ఐదం రాజు, పరిపాలన అధికారి విఎన్.ప్రసాద్ లు సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ద్వారపూడి, ఇప్పనపాడు, కేశవరం, ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాల్లో ఎనిమిది వాలంటరీ పోస్టులు ఖాళీగా ఉండగా వీటికి 17 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

'నాడు-నేడు' పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

గుత్తెనదీవి గ్రామ పంచాయతీ పరిధిలో నాడు-నేడు పనులకు సోమవారం ప్రజాప్రతినిధుల శంకుస్థాపన చేశారు. జెగ్గంపేట, రాఘవేంద్రపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలకు రూ.50 లక్షలతో ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి వీర వెంకట సత్య సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలోసొసైటీ అధ్యక్షులు కశిలింక నరసిహమూర్తి, ఎంపిటిసి సభ్యుడు జొన్నాడ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సందర్శన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రభుత్వం కేటాయించిన భూములను సోమవారం జనసేన పార్టీ నాయకుల సందర్శించారు. ప్రభుత్వం లబ్ధిదారులుకు గృహాలు నిర్మించాలని వారు ప్లకార్డులు ప్రదర్శించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జగనన్న ఇల్లు పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా అల్లవరం మండలం డి.రావులపాలెం, దేవగుప్తం, ఎంట్రుకోన గ్రామాల్లో డిఎంఆర్.శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వం కేటాయించిన భూములు సందర్శించారు. శేఖర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్ళు నిర్మించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యంగా పరిగణించాలన్నారు. **ఉప్పలగుప్తం** జగనన్న లే అవుట్లల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఎన్ని నిధులు కేటాయించారు, స్థలాలు మెరక చేయడానికి కేటాయించిన నిధుల వివరాలు కోరుతూ జనసేన పార్టీ నాయకులు డిఎంఆర్.శేఖర్ ఆధ్వర్యంలో చల్లపల్లి, ఎన్.కొత్తపల్లి పంచాయతీ కార్యాలయాల్లో అర్జీ లు అందజేశారు.

భూ సర్వేపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కాజులూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర భూ సర్వేపై రైతులు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహశీల్దార్ బి.సుబ్బారావు అన్నారు. సోమవారం మండలంలోని శలపాక, దుగ్గుదుర్రు గ్రామాల్లో రైతులకు సమగ్ర భూ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను ఈ సమగ్ర భూ సర్వే ద్వారా పరిష్కారం కాగలవని ఆయన అన్నారు. ప్రతి రైతూ తమ భూమికి సంబంధించి డాక్యుమెంట్లు ఆధార్ కార్డు బ్యాంకు ఖాతా నంబర్ వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అందించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో తణుకువాడ శలపాక సర్పంచులు నరాల సుబ్బరాజు, పోతు గనిరాజు, గనికమ్మ, అజయ్ కుమార్, పెంకే శ్రీజ్యోతి, పి.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని దాష్టీకం వార్త అవాస్తవం

ప్రజాశక్తి-కరప

కరప నక్కా సూర్యనారాయణ మూర్తి హైస్కూల్లో విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాష్టీకం అంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తమని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించి కరప ఎంఇఒ కె.కృష్ణవేణి, పోలీసులు విచారణ చేపట్టారు. పిహెచ్‌సి వైద్యాధికారి విద్యార్థిని పరీక్షించి ఎటువంటి గాయాలూ లేవని నిర్ధారించారు.

జగనన్న ఇళ్ల పట్టాలపై వినతి

ప్రజాశక్తి- కరప

మండలంలో జగనన్న ఇల్లు పట్టాలను అర్హులైన లబ్ధిదారులకు అందించిన వివరాలను అందించాలని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు, పి.దుర్గాప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి.గంగాధర్ ఆధ్వర్యంలో సచివాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు ఎంతమందికి ఇంటి రుణాలు మంజూరు చేశారు, ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎంతమంది అర్హులకు పట్టాలిచ్చారో తెలియపరచాలని దరఖాస్తులో కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లెళ్ల ప్రసాద్, వై.పండు, రమేష్ పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారం అందించడమే లక్ష్యమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీనీ నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ, నాగశాస్త్రులు, పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పిశెట్టి సురేష్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత తహశీల్దారు రేలంగి బాపిరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో పుట్టినరోజు అత్యంత ప్రధానమైన పండుగ అన్నారు. మానవ బంధాలను పటిష్టం చేసే పుట్టినరోజున వృద్ధులకు దుప్పట్లు సమకూర్చడం, భోజన వితరణ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, అడబాల సత్తిబాబు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం సీతానగరం మండలం ముగ్గుళ్ళకు చెందిన కాటే రాముపై దాడి చేసిన ఘటనలో సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. డబ్బులు విషయంలో వివాదం జరిగి బొబ్బిల్లంక కు చెందిన సోడదాసి రమేష్ రాము తలపై కొట్టాడు. ఈ మేరకు రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుని మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

ఆటో ఢీకొని వద్దుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం నర్సిపూడి గుమ్మలేరు ఆర్అండ్‌బి రహదారిపై మోదుకూరు ఎస్‌సి పేట వద్ద అదే గ్రామానికి చెందిన వద్దుడు ఆకుల మున్నియ్య(72) సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లేందుకు రహదారి వెంబడి నడిచి వెళుతున్నాడు. ఇంతలో అటుగా వెళుతున్న ఆటో వద్దుని ఢీకొనడంతో డ్రైనేజీలో పడి మృతి చెందాడు. ఈ మేరకు మున్నియ్య కుమారుడు ఆకుల చౌదరి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దీక్షా శిబిరంలో ప్రజా సంఘాల నాయకులు

దంగేటి రాంబాబును అరెస్టు చేయాలని డి మాండ్

ప్రజాశక్తి -అమలాపురం

చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఎస్‌టి మహిళా ఉద్యోగిని రొడ్డ భవాని పై భవాని మృతికి కారకులైన దంగేటి రాంబాబు ను అరెస్టు చేయాలని భవాని న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. స్థానిక కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 74వ రోజుకి చేరుకున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాగిత శ్రీనివాసరావు మాట్లాడుతూ రాంబాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ గూడపాటి విజయకుమార్, మాల మహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు,ఎన్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -మండపేట

ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు 2 వార్డులో జరుగుతున్న పలుఅభివృద్ధి పనులను సోమవారం 2 కౌన్సిలర్ చిట్టూరి సతీష్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఆయన వెంట పురపాలక సంఘ డిఇ సత్యనారాయణ, ఎఇ సత్యనారాయణ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కాలనీలో విద్యుత్ లైన్ నిర్మాణంలో పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. వివరాలు ఇవి.. విద్యుత్ లైన్ నిర్మాణానికి కాంట్రాక్టర్ వెస్ట్ బెంగాల్ నుంచి 14 మంది కార్మికులను తీసుకొచ్చాడు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలో రామచంద్రపురం జగనన్న కాలనీల్లో వారు పనిచేస్తున్నారు. లాల్ ముండా(31) పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటనపై సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి గ్రామ శివారు 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీను వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం అచ్చన్న పాలెం ఎస్‌సి కాలనీకి చెందిన బోడి గడ్ల యువరాజ్ బైకుపై ఎర్నగూడెం వైపు వెళ్తున్నాడు. అనంత పల్లి గ్రామ శివారులో బ్రిడ్జిపై ఆగి ఉన్న లారీను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో యువరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వెంటనే అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలో పలుచోట్ల సారా బట్టీలపై సోమవారం దాడులు నిర్వహించి 20 లీటర్ల సారా సీజ్ చేసి,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కోమటికుంటలో400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. మైనం పోసిబాబును అదుపులోకి తీసుకున్నామని అన్నారు. జగన్నాథపురం చెరుకు తోటలో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి అద్దేపల్లి చిరంజీవిని అదులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.